అంజనీ తనయ.. అభయాంజనేయ

- గ్రామగ్రామనా అంబరాన్నంటిన హనుమజ్జయంతి వేడుకలు
- గుట్టపల్లెలో ఘనంగా వీరాంజనేయుని తిరునాల
- ఆలయాల్లో విశేష పూజలందుకున్న అంజన్న
- అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేసిన ఆలయ కమిటీలు


నందలూరు: అలంకరణలో హనుమంతుడు


ఒంటిమిట్ట: పెద్దకొత్తపల్లిలో


రాజంపేట రూరల్: పూజలందుకున్న ఆంజనీ తనయుడు


సంబేపల్లె: భక్తులకు దర్శనమిస్తున్న వీరాంజనేయస్వామి


గాలివీడు: ప్రత్యేక అలంకరణలో హనుమాన్


చిట్వేలి: అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

సంబేపల్లె : మండలంలోని గుట్టపల్లె శ్రీ వీరాంజనేయ స్వామి, శెట్టిపల్లె పాలాలబండ, మోటకట్ల, మండల కేంద్రాలలో కొలువైన శ్రీ వీరాంజనేయస్వామి ఆలయాలలో హనుమాన్ జయంతి వేడుకలను శనివారం భక్తులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలను వివిధ రకాల పుష్పగుచ్ఛాలు, విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేదపండితులచే సింధూర, ఆకుపూజలతోపాటు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు గావించారు. వచ్చిన భక్తులకు దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఓబులవారిపల్లెలో..

ఓబులవారిపల్లె : హనుమాన్ జయంతిని పురస్కరించుకొని శనివారం మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలలో హనుమాన్ జయంతి వేడుకలను భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించడం జరిగింది. మండల కేంద్రంలోని రామాలయం ప్రాంగణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం నుంచి భక్తులు పెద్దఎత్తున స్వామివారికి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగంపేట నీరుంపల్లె ఆంజనేయ స్వామి, యల్లాయపల్లె శ్రీ అభయాంజనేయస్వామి తదితర ప్రాంతాలల్లోని ఆంజనేయస్వామి ఆలయాలలో జయంతి వేడుకలు ఘనంగా జరిపారు. మంగంపేట నీరుంపల్లె ఆంజనేయస్వామిని గుంతకల్ డీఆర్‌సీసీయూ మెంబర్ తల్లెం భరత్‌కుమార్ రెడ్డి, వైఎస్సార్ పార్టీ నాయకులు కొలూరు రమణా రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నఓరంపాడు, కమ్మపల్లె దళితవాడ గ్రామంలో ఆంజనేయ స్వామి చిత్రపటాన్ని ట్రాక్టర్‌పై ఊరేగిస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ కన్వీనర్ డీఆర్ ప్రేమ్, ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలిలో..

చిట్వేలి : హనుమాన్ జయంతిని పురస్కరించుకొని శనివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాజుకుంట క్రాస్ రోడ్డు వద్ద వెలసిన అభయాంజనేయ స్వామి ఆలయంలో ఉదయం 9 గంటలకు గణపతి పూజ, సృష్టివచనం, నవగ్రహ ఆరాధన, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, మహానైవేద్యం, మంగళహారతి, ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు జరిపారు. అలాగే మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం చెక్కభజన కార్యక్రమాలు నిర్వహించారు. అదే విధంగా తిమ్మాయిపాలెం క్రాస్ రోడ్డు వద్ద చిట్వేలి బ్రాహ్మణ వీధిలో, తిమ్మాయిగారిపల్లె వద్ద వెలసి ఉన్న ఆంజనేయస్వామి విగ్రహాల వద్ద పూజలు, అన్నదానాలు చేశారు. వేలాదిగా భక్తులు స్వామివారిని దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా హనుమన్ జయంతి

పుల్లంపేట : మండల పరిధిలోని అనంతంపల్లి గ్రామం, కోటగడ్డపై వెలసిన అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం హనుమన్ జయంతిని పురస్కరించుకొని వేదపండితులు నందయ్య స్వామి ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పాలాభిషేకం చేశారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం దేశ నారాయణరెడ్డి దంపతులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

రాజంపేటలో..

రాజంపేట టౌన్ : నియోజకవర్గ వ్యాప్తంగా శనివారం హనుమాన్ జయంతి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామి ఆలయాల్లోని హనుమాన్ మూలవిరాట్‌లను పట్టువస్త్రాలతో, ప్రత్యేక పుష్పాలతో విశేషంగా అలంకరించారు. వేకువజాము నుంచే ఆయా ఆలయ పురోహితులు అర్చనలు, అభిషేకాలతో పూజా కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు విశేష సంఖ్యలో ఆలయాలకు తరలి వచ్చి స్వామివారికి పూజలు చేశారు. దీంతో ఆంజనేయ స్వామి ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. కాగా మండలంలోని బసినాయుడుగారిపల్లెలో వెలసిన అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆ ఆలయ ధర్మకర్త పోతుగుంట రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో అల్పాహారం ఏర్పాటు చేశారు.

నందలూరులో..

నందలూరు : మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లె పంచాయతీ టంగుటూరు ప్రకాశం పంతులు వీధిలో వెలసిన శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో కీ.శే.లు పల్లె మైరామ్ రెడ్డి జ్ఞాపకార్థం ఆ వీధి ఆంజనేయస్వామి గ్రామ సేవకులు ఆధ్వర్యంలో, అలాగే గాంధీనగర్‌లో వెలసిన అభయాంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమ జన్మదినోత్సవం సందర్భంగా ఆయా ఆలయాలలో ఆలయ పూజారులు నాగరాజు స్వామి, నరసా రవికుమార్‌ల ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. పెద్దఎత్తున మహిళలు పాల్గొని కుంకుమార్చన జరిపారు. వ్యాఖ్యాతగా పసుపులేటి శంకర్ వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా జెడ్పీటీసీ ప్రతినిధి గడికోట వెంకటసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల మహిళా అధ్యక్షురాలు పల్లె మాధవిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం ఆలయం నుండి స్థానిక బస్టాండ్ కూడలి వరకు గ్రామోత్సవం నిర్వహించారు.

కనుల పండువగా సీతారాముల కల్యాణోత్సవం

సుండుపల్లె : హనుమాన్ జయంతి సందర్భంగా మండల పరిధిలోని గుట్టకాడ బలిజపల్లె గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి గుడిలో సీతారాముల వారి కల్యాణ మహోత్సవాన్ని ఆలయ కమిటీ సభ్యులు కనుల పండువగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల విగ్రహాలను పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యాన్ని కల్పించారు. స్వామి, అమ్మవార్ల కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామివారి కల్యాణం అనంతరం అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. తదనంతరం రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలతో, చాందినీ బండ్లతో మొక్కులు తీర్చుకున్నారు.

రాజంపేట రూరల్‌లో..

రాజంపేట రూరల్ : హనుమజ్జయంతి వేడుకలు శనివారం మండల పరిధిలోని పలు ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. పోలి చెరువు కట్టపై ఉన్న ఆంజనేయస్వామి, పట్టణంలోని వైబీఎన్ పల్లె గ్రామంలో వెలసివున్న వినాయక అభయ ఆంజనేయస్వామి దేవస్థానంతోపాటు మండలాల్లో వివిధ గ్రామాల్లో ఉన్న అంజన్న ఆలయాల్లో మూలవిరాట్టులకు అభిషేకాలు, ఆకుపూజలు, వడమాల ప్రత్యేక పూజలు జరిపారు. మహిళలు అధిక సంఖ్యలో అంజన్న ఆలయాలకు తరలివచ్చారు. జయంతి వేడుకలలో పాల్గొన్న భక్తులకు మహిళలు హనుమాన్‌చాలీసా పారాయణం చేయడం జరిగింది. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

సిద్ధవటంలో..

సిద్ధవటం : మండలంలోని కనుమలోపల్లె గ్రామ సమీపంలో వేలసిన పర్వతగిరి దక్షిణముఖ అంజనేయ స్వామి ఆలయం వద్ద శనివారం హనుమన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు లక్షుమయ్య ఆధ్వర్యంలో స్వామి వారికి గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచామృతాభిషేకం, ఆకుపూజ, అర్చనలు, మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాదాల వినియోగం వంటి పూజా కార్యక్రమాలను చేశారు. అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకొని కాయాకర్పూరాలను సమర్పించి పూజలు చేశారు. వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

అంజనీ పుత్రునికి విశేష పూజలు

గాలివీడు : మండల కేంద్రంలోని పెద్దూరు బ్రాహ్మణవీధిలో వెలసిన క్షేత్రపాలకుడు, దక్షిణముఖ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆనంద్ ఆచార్యుల ఆధ్వర్యంలో అంజనీ పుత్రునికి అభిషేకాలు, తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా ఆంజనేయుని ఆలయాలు జై హనుమాన్ నామస్మరణతో మార్మోగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించి, ఫలాలు, పుష్పాలు సమర్పించారు.

రామాపురంలో..

రామాపురం : మండలంలోని 14 గ్రామ పంచాయతీ పరిధిలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయాన్నే భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామికి ఆకుపూజ అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సుద్దమళ్ల గ్రామం యర్రంరెడ్డిగారిపల్లెలో హనుమంతునికి నిర్వహించిన అబిషేకం, ప్రత్యేక పూజలలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డిలు పాల్గొని పూజలు నిర్వహించారు.

రైల్వేకోడూరులో..

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని కోడూరు, బొజ్జవారిపల్లె ఆలయాలలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయాలలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. గాండ్లవీధి, టోల్గేటు, బొజ్జవారిపల్లి గ్రామాలలో ఉన్న ఆంజనేయస్వామి భారీ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. అన్నదానం చేశారు.

ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు

చిన్నమండెం : మండల వ్యాప్తంగా ఉన్న పలు ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమజ్జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవిరాట్ మూర్తులను పలు పుష్పాలతో అందంగా అలంకరించారు. స్వామి వారికి ఆకుపూజలు, సింధూర పూజలతోపాటు తదితర పూజాది క్రతువులను నిర్వహించారు. పలు ఆలయాలలో అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

ఒంటిమిట్టలో..

ఒంటిమిట్ట : మండలంలో హనుమజ్జయంతి వేడుకలు ఆంజనేయుని దేవాలయాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా ఒంటిమిట్టలోని సంజీవరాయ స్వామి దేవస్థానం, ఒంటిమిట్ట చెరువుకట్టపై, మంగంపేట వద్ద, కొత్తపల్లిలో నెలకొన్న ఆంజనేయస్వామి దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయాలలో శుద్ధి చేసిన ఆంజనేయునికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. హనుమ జయంతి సందర్భంగా ప్రత్యేకంగా ఆకుపూజను అర్చకులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు స్వామివారికి కాయాకర్పూరం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారికి నైవేద్యంగా హనుమంతునికి ఎంతో ప్రీతిపాత్రమైన అరటిపండ్లు, వడపప్పు, పానకం, బెల్లం, శనగలు, బూందీ తదితరాలు సమర్పించారు. అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.


సుండుపల్లె: సీతారాముల కల్యాణం చేస్తున్న వేదపండితులు, కల్యాణోత్సవంలో పాల్గొన్న భకులు


పుల్లంపేట: దర్శనమిస్తున్న అభయాంజనేయుడు


సిద్ధవటం: పూజలందుకుంటున్న దక్షిణముఖ ఆంజనేయస్వామి


రైల్వేకోడూరు అర్బన్: స్వామివారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు


రామాపురం: ఆలయంలో పూజలు చేస్తున ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు


ఓబులవారిపల్లె: గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


క్లుప్తంగా

అల్లర్లు చేస్తే ఉపేక్షించేది లేదు


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ పెద్ద ఓబన్న

సిద్ధవటం : ఈనెల 4వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సమయంలో గ్రామాల్లో అల్లర్లు సృష్టితే ఉపేక్షించేది లేదని ఎస్‌ఐ పెద్ద ఓబన్న హెచ్చరించారు. మండలంలోని కడపాయపల్లె హరిజనవాడ, లింగంపల్లె గ్రామాల్లో శనివారం నాకాబందీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ తరువాత బైక్ ర్యాలీలు, టపాసులు పేల్చడం, నిషేధమన్నారు. గ్రామాల్లో ప్రశాంతంగా ఉండాలని, గొడవలు జరిగితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ తెలియజేశారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాజు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మండలంలో పోలీసు పహారా


పహారా కాస్తున్న పోలీసులు

పెనగలూరు (ఓబులవారిపల్లె) : ఎగ్జిట్ పోల్స్ విడుదల సందర్భంగా మండలంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ సుభాష్ చంద్రబోస్ తెలిపారు. పెనగలూరు, బెస్తపల్లె, చక్రంపేట సర్కిల్ వద్ద తమ సిబ్బందితో ముందు జాగ్రత్తగా 144 సెక్షన్ అమలుపరిచినట్లు తెలియజేశారు. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా ఎగ్జిట్ పోల్స్ చూసి ప్రజలు ఆవేశపడరాదన్నారు. ప్రశాంతంగా కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేలాగా అందరూ సహకరించాలన్నారు.

నేటి నుంచి నల్లగంగమ్మ తిరునాల

కేవీపల్లె : మండలంలోని మిన్నంరెడ్డిగారిపల్లెలో వెలసిన శ్రీ నల్లగంగమ్మ తిరునాల ఆదివారం నుంచి రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఆదివారం ఉదయం అమ్మవారి అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

సంబేపల్లె : వేసవి సెలవులు సందర్భంగా మే 27వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం జరుగుతోంది. సంబేపల్లె మండలంలోని ఇందిరమ్మ కాలనీ, గుట్టపల్లి, దేవపట్ల, ఆవుల వాండ్లపల్లె సంబేపల్లె గ్రామాలలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక బంగారు పాళ్యం కమిటీ, గుంటూరు కమిటీ, ఒంగోలు కమిటీ, పిడుగురాళ్ల కమిటీ, చిలకలూరిపేట కమిటీల సభ్యుల వారి ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం జరిగింది. భగవద్గీతలోని పురుషోత్తమ ప్రాప్తి యోగం అధ్యాయంలో 16వ శ్లోకంలో క్షరపురుషుడు అని జీవాత్మ గురించి అక్షర పురుషుడు అని ఆత్మ గురించి, 17వ శ్లోకంలో పురుషోత్తముడు అని పరమాత్మ గురించి తెలియజేశారు. ఆత్మ, జీవాత్మ, పరమాత్మ అనే మూడు ఆత్మలు ఆధ్యాత్మికంలో ముఖ్యమైనవని అర్థం. దీని ఆధారంగానే త్రైత సిద్ధాంతం భగవద్గీతను రాశారు. ఒక సిద్ధాంతాన్ని ప్రతిపాదన చేసి శాస్త్ర బద్ధతతో కూడిన జ్ఞానంను అందించారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి బంగారుపాళ్యం కమిటీ, గుంటూరు కమిటీ, ఒంగోలు కమిటీ, పిడుగురాళ్ల కమిటీ, చిలకలూరిపేట కమిటీల అధ్యక్షులు, సభ్యులు బాలాజీ, శ్రీనివాస్, సుబ్బారావు, సైదరావు, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం దృశ్యం


రైతులకు నిత్యం అందుబాటులో ఉండండి

సిద్ధవటం : మండలంలోని పెద్దపల్లె, బొగ్గిడివారి పల్లె గ్రామ పంచాయతీల్లోని రైతు భరోసా కేంద్రాలను శనివారం బద్వేల్‌లో సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను, సిబ్బంది హాజరును పరిశీలించారు. అంతేగాకుండా రైతులకు పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులను రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీకి తక్షణమే ఇండెంట్ పెట్టాల్సిందిగా సిబ్బందికి సూచించామన్నారు. పలు రకాల రిజిస్టర్లను అప్‌డేట్ చెయ్యాలన్నారు. బొగ్గిడివారిపల్లెలో వరి పీబీటీ 5204 మూల విత్తనం పంపిణీ చేయాల్సిందిగా రైతులు అడగడం జరిగిందన్నారు. కనీసం రెండు యూనిట్లు అవసరమని తెలిపారన్నారు. జీలుగ, జనుము విత్తనములను బద్వేల్ మార్కెట్ యార్డులోని సమీకృత నాణ్యత పరీక్ష కేంద్రంలో మొలకల శాతం నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సిబ్బందికి సూచించడం జరిగిందన్నారు. రైతులకు అను నిత్యము అందుబాటులో ఉంటూ అన్నీ రకాల సేవలను అందిస్తు రైతుల మన్ననలను పొందాలన్నారు. రైతులు వాస్తవంగా వినియోగిస్తున్న మొబైల్ నెంబర్ సేకరించి నిర్దేశిత పోర్టల్‌లో అప్‌లోడ్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించామన్నారు. ఖరీఫ్ సీజన్‌కు రైతులను అన్ని విధాలా సమయాత్తం చేయాలని, క్రమం తప్పకుండా అవగాహన కార్యక్రమాలు, ముఖాముఖి చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం సహాయకులు, రైతులు పాల్గొన్నారు.


రైతులకు పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను పంపిణీ చేస్తున్న బద్వేల్ ఏడీఏ నాగరాజు

ఫార్మసీ విద్యతో ఉపాధి అవకాశాలు

రాజంపేట : ఫార్మసీ విద్యతో మెరుగైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి అన్నారు. శనివారం స్థానిక అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో ఆరు సంవత్సరాల ఫార్మ్–డీ విద్యను అభ్యసించి పూర్తి చేసుకున్న విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో వైద్య రంగంలో ఫార్మసీ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో విద్యను అభ్యసించిన వేలాది మంది విద్యార్థులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకున్నారని పేర్కొన్నారు. దేశ, విదేశాలలో పేరొందిన కంపెనీలలో అవకాశాలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ స్వర్ణలత, ఫార్మసీ కళాశాల అధ్యాపకులు ద్వారకనాథరెడ్డి. డా.గిరిరాజశేఖర్, డా.ఎం.శిరీషా, డా.ఎం.ప్రమోద్, డా.మణిదీప్, వినీల, హాసినీలతోపాటు అధ్యాపక బృందం పాల్గొన్నారు.


వీడ్కోలు సభలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చొప్పా ఎల్లారెడ్డి

భూ ఆక్రమణపై ఫిర్యాదు

పీలేరు : తప్పుడు రికార్డులు సృష్టించి తమ భూమిని ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారని పట్టణానికి సురేష్ శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. బాధితుని కథనం మేరకు వివరాలిలావున్నాయి. స్థానిక ఇందిరమ్మ కాలనీలో సమీపంలో సర్వే నెంబరు 1130/15లో సురేష్ 1.81 ఎకరాలు భూమిని 2012లో కొనుగోలు చేశాడు. ఇప్పటి నుంచి ఇతరులు ఈ భూమి తమదంటూ రావడంతో 2013లో కోర్టుకు వెళ్లడంతో తనకే అనుకూలంగా వచ్చినట్లు సురేష్ తెలిపారు. అయితే శనివారం కొంతమంది తన భూమిని చదును చేయడంతో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

7న ఊటీకి ప్రత్యేక బస్సు సర్వీసు

మదనపల్లె సిటీ : ఈనెల 7న ఊటీ, మైసూర్ ప్రదేశాలకు ప్రత్యేక బస్సు సర్వీసు నడపనున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. 7న రాత్రి 9 గటంలకు బయలుదేరి 8న ఉదయం ఊటీకి చేరుకుంటుందన్నారు. 9న ఉదయం ఊటీ నుంచి బయలుదేరి మైసూర్ వచ్చి అక్కడ పలు ప్రదేశాలు చూసి రాత్రి బయలుదేరి 10న ఉదయం మదనపల్లెకు చేరుకుంటుందన్నారు. రాను, పోను చార్జి రూ.2800 చెల్లించాలన్నారు. సీట్ల కోసం 7382875034, 7382876658ను సంప్రదించాలని కోరారు.

గ్రంథాలయంలో ఆటల పోటీలు

సిద్ధవటం : విద్యార్థి దశ నుంచే విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారిణి లక్ష్మీనారాయణమ్మ తెలిపారు. మండల కేంద్రంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు పుస్తక పఠనం, క్యారం, చెస్, లూడో ఆటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాయలాధికారిణి లక్ష్మీనారాయణమ్మ మాట్లాడుతూ గ్రంథాలయంలోని పుస్తకాలను చదవడం ద్వారా అనేక విషయాలకు సంబంధించిన సమధానాలు దొరకడంతో పాటు, పరిజ్ఞానం పెంపొందుతారన్నారు. గ్రామంలో అన్నీ వయస్సుల వారు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె అన్నారు.



సౌమ్యనాథుని దర్శించుకున్న ఎంపీపీ

నందలూరు : జిల్లాలో చారిత్రాత్మక కట్టడాలలో ఒకటైన నందలూరు శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయానికి శనివారం ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి కుటుంబ సమేతంగా, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి దంపతులతో కలసి స్వామివారిని దర్శించుకున్నారు. ముందుగా ఆలయ మర్యాదలతో వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారిని పూలమాల, శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ నేపథ్యంలో ఆలయ ఆవరణలో కొలువైన ఆంజనేయస్వామిని వారు దర్శించుకున్నారు. కార్యక్రమంలో మండల కో–ఆప్షన్ సభ్యులు కలీం, సోమిశెట్టి ప్రభాకర్, తుమ్మల శ్రీధర్ గౌడ్, గుణ యాదవ్, పెనుబాల నాగసుబ్బమ్మ, అరిగె నాని, ఓట్స్ శ్రీనివాసులు, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.


సౌమ్యనాథస్వామిని దర్శించుకుంటున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి

రాజంపేటలో గాలివాన బీభత్సం


అర్‌అండ్‌బీ బంగ్లా వద్ద బైక్‌లపై పడ్డ భారీ వృక్షం


పద్మప్రియ కల్యాణ మండపం వద్ద విద్యుత్ వైర్లపై పడ్డ రేకు

రాజంపేట టౌన్ : పట్టణంలో శనివారం సాయంత్రం 6:30 గంటల ప్రాంతంలో గాలి, వాన బీభత్సం సృష్టించింది. దీంతో పట్టణంలో కొన్ని చోట్ల భారీ వృక్షాలు నేలకొరిగాయి. మెయిన్ రోడ్డులో ఓ భారీ వృక్షం బైక్లపై పడటంతో బైక్‌లు దెబ్బతిన్నాయి. అలాగే వృక్షాలు విద్యుత్ వైర్లపై పడ్డాయి. రాంనగర్ వెళ్లే మార్గంలోని చక్రాలమడుగు వద్ద విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. గాలి ప్రారంభం కాగానే విద్యుత్ సరఫరా నిలిపి వేయడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. అలాగే పలు షాపులపై ఏర్పాటు చేసిన బోర్డులు నేలకొరిగాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఒక్కసారిగా గాలి, వాన బీభత్సం సృష్టించడంతో పట్టణ ప్రజలు భయాందోళనకు గురయ్యారు. అలాగే ప్రధాన రహదారోల్లో రాకపోకలు సాగిస్తున్న ప్రజలు ఎక్కడికక్కడ నిలిచిపోయారు.


గాంధీ సర్కిల్లో ఈదురు గాలులకు నేలపై పడ్డ హోర్డింగ్